AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

దుర్గమ్మకు భక్తితో ప్రణమిల్లి..

2



2

అంతర్రాష్ట్ర దొంగలపై పీడీ యాక్ట్ నమోదు

జూనియర్ అంతర్‌జిల్లా కబడ్డీ ఛాంపియన్‌షిప్ ఆరంభం

అక్షరటుడే, ముప్కాల్: మండల కేంద్రంలో నునుగొండ శ్యామల మెమోరియల్ 35వ జూనియర్ అంతర్‌జిల్లా కబడ్డీ ఛాంపియన్‌షిప్ టోర్నీ ప్రారంభమైంది. స్థానిక జీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో టోర్నీ ప్రశాంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు యువతకు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను పెంపొందిస్తాయన్నారు. ముఖ్యంగా క్రీడల ద్వారా గ్రామీణ ప్రాంతాల నుండి ప్రతిభావంతులైన ఆటగాళ్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి ఛాంపియన్‌షిప్‌లు క్రీడాకారులకు మరింత ప్రోత్సాహాన్నిస్తాయని స్పష్టం చేశారు.

ఎస్సారెస్పీకి పోటెత్తుతున్న వరద..

అక్షరటుడే, బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఎగువన మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 3,15,486 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో 39 గేట్లు ఎత్తి దిగువకు అంతే మొత్తంలో నీటిని వదులుతున్నారు. అలాగే కాల్వల ద్వారా నీటిసరఫరా కొనసాగుతోంది. వరద కాలువ ద్వారా 5,834 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు. 561 క్యూసెక్కులు ఆవిరి అవుతోంది. అలాగే సరస్వతి కాలువ నుంచి 400 క్యూసెక్కుల నీరు, లక్ష్మి కాలువ నుంచి 100 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్టుకు 360 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. 1082.00 అడుగుల (50.05 టీఎంసీ) మేర నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈఈ కొత్తరవి సూచించారు.

మానవతావాద సిద్ధాంతమే దేశ అభివృద్ధికి మంత్రం

అక్షరటుడే, ఇందూరు: ఏకాత్మత మానవతావాద సిద్ధాంతమే దేశ అభివృద్ధికి మంత్రమని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని మారుతి నగర్ స్నేహ సొసైటీలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారతీయ జన్ సంఘ్‌కు సిద్ధాంతాలు లేవన్న వారికి చెప్పపెట్టులా ఏకాత్మత మానవతా సిద్ధాంతం ప్రతిపాదించిన మహోన్నత వ్యక్తి దీన్‌దయాల్ అని కొనియాడారు. ఆయన ఆశించినట్టుగా చిట్టచివరి పేద వ్యక్తికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలన్న సంకల్పంతో దేశాన్ని ప్రధాని మోదీ నడిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ ప్రతినిధులు సిద్దయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, నాయకులు నాగోల్ల లక్ష్మీనారాయణ, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నగరంలో అక్రమ నిర్మాణం కూల్చివేత

అక్షరటుడే, ఇందూరు: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ కట్టడాలపై అధికారులు దృష్టి సారించారు. రోడ్డుపై అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని గురువారం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు కూల్చివేశారు. నాగారం సమీపంలోని డీఎస్ కాలనీలో రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాన్ని చేపడుతున్నారని మున్సిపల్ అధికారులకు సమాచారం అందింది. దీంతో స్పందించిన అధికారులు గురువారం కట్టడాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలంలో నాలాలపై ఎవరూ నిర్మాణాలు చేపట్టరాదన్నారు. అక్రమంగా నిర్మిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నాం

అక్షరటుడే, ధర్పల్లి: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. మండలంలోని సీతాయ్‌పేటలో గురువారం నిర్వహించిన ఇందిరమ్మ గృహప్రవేశం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా మహిళల కోసం ఉచిత బస్సు, గృహజ్యోతి, గృహలక్ష్మి వంటి పథకాలను ఇప్పటికే అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, వరి ధాన్యానికి బోనస్ రైతు భరోసా కల్పిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సింగిల్ విండో చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, పుప్పాల సుభాష్, మనోహర్ రెడ్డి, స్థానిక నాయకులు లొక్కిడి రాములు, ఆశన్న, నిశాంత్, బాలయ్య, రాజన్న, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పింఛన్ల పంపిణీలో పలువురు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు ప్రభుత్వం పింఛన్లు అందజేస్తోంది. దివ్యాంగులకు రూ.4,016 పింఛన్ ఇస్తుండగా.. మిగతా వారికి రూ.2,016 అందిస్తోంది. అయితే పింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది పైన చిల్లర డబ్బులు లబ్ధిదారులకు అందించడం లేదు. ఆ 16 రూపాయలను తమ జేబులో వేసుకుంటున్నారు. చిల్లరే కదా అని పింఛన్‌దారులు కూడా పట్టించుకోవడం లేదు.

- అక్షరటుడే, కామారెడ్డి



పింఛన్లలో చిల్లర దోపిడీ!

- రూ.16 ఇవ్వకుండానే పంపిణీ చేస్తున్న వైనం
- స్మార్ట్ దోపిడీ చేస్తున్న అధికారులు
- అడిగితే దబాయింపులు

కామారెడ్డి జిల్లాలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు ఇలా అనేక రకాల పింఛన్లు కలిపి 1.62 లక్షల మంది లబ్ధిదారులు ఉంటారు. వీరికి ప్రతి నెలా రూ. 36 కోట్ల పై చిలుకు ప్రభుత్వం అందజేస్తుంది. పైన అందజేసే చిల్లర కొన్ని ప్రాంతాల్లో రూ.6, మరికొన్ని ప్రాంతాల్లో ఏకంగా రూ.16 చిల్లర లేవు అని చెప్పి లబ్ధిదారులకు ఇవ్వడం లేదు. అదేమిటని అడిగితే రూ.100 ఉన్నాయి, రూ.500 ఉన్నాయి చిల్లర తెచ్చి ఇవ్వండి అని దబాయిస్తున్నారు. దీంతో చాలా మంది వారిని అడగడం మానేశారు.

రూ.లక్షల సొమ్ము..

కామారెడ్డి జిల్లాలో 1.62 లక్షల మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.16చొప్పున డబ్బులు తీసుకుంటే.. రూ.26 లక్షలు, రూ.6 చొప్పున లెక్క వేస్తే దాదాపు రూ.10 లక్షలు లబ్ధిదారులకు అందడం లేదు. ఆ మొత్తం పింఛన్లు పంపిణీ చేసే వారి జేబులోకి వెళ్తున్నాయి. రూ.రెండు వేలు, రూ.నాలుగు వేల పింఛన్ ఇస్తున్న వారు మొత్తం ఇచ్చినట్లు నమోదు చేస్తున్నారు. ఒక గ్రామంలో అటుఇటుగా దాదాపు 250 నుంచి 400 మంది వరకు పింఛన్‌దారులు ఉంటారు. మరికొన్ని చోట్ల పక్కనున్న రెండుమూడు గ్రామాలకు సైతం ఒకే ఊరిలో పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఇలా ఒక్కో పింఛన్ పైన ఇచ్చే చిల్లర మొత్తం దాదాపు నెలకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు పంపిణీ చేసే వారు నొక్కేస్తున్నారు.

డిచ్‌పల్లి పరిధిలోనే నెలకు రూ.2 లక్షలు..

డిచ్‌పల్లి మండల పరిధిలో మొత్తంగా 12,356 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా డిచ్‌పల్లి పరిధిలోని ఆయా సబ్‌పోస్టాఫీస్‌ల ఆధ్వర్యంలో పింఛన్లు అందజేస్తున్నారు. అయితే ఈ పింఛన్‌దారులకు ప్రతినెలా రూ.2016కు గాను రూ.2,000 మాత్రమే ఇస్తూ వచ్చారు. రికార్డుల్లో మాత్రం రూ.2,016 ఇచ్చినట్లే ఎంట్రీ చేస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన ఒక పింఛన్‌దారుడి నుంచి రూ.16 మైనస్ చేస్తే.. 12,356 మంది లబ్ధిదారుల నుంచి నెలకు రూ.1,97,296 చొప్పున పోస్టాఫీస్ సిబ్బంది మాయం చేస్తున్నారని సమాచారం. చూస్తే రూ.16 మాత్రమే అయినా.. మొత్తంగా చూస్తే ఒక్క డిచ్‌పల్లి మండలం పరిధిలోనే నెలకు సుమారు రూ.2లక్షల దోపిడీ జరుగుతోంది.

ఇంటికెళ్లి ఇస్తే రూ.50 వసూలు

పింఛన్‌దారుల్లో కొంతమంది అనారోగ్యాల బారిన పడడం, ఇతర వృద్ధాప్య కారణాలతో ఆఫీస్‌లకు వెళ్లి తీసుకోలేరు. అలాంటి వారి ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నారు. అయితే వారి దగ్గర రూ.50 నుంచి రూ.100 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇలా లబ్ధిదారుల నుంచి అన్ని చోట్ల వసూళ్లకు పాల్పడుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఖాతాలో వేస్తేనే సేఫ్

ప్రతి నెలా ఇచ్చే పెన్షన్ పంపిణీపై ప్రభుత్వాలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. బయోమెట్రిక్ విధానాన్ని తీసేసి ప్రతినెలా పెన్షన్ దారుడి ఖాతాలోకి నేరుగా నగదు బదిలీ చేస్తే చిల్లర కాజేసే అవకాశాలు ఉండవని పలువురు చెబుతున్నారు. ఖాతాలో నగదు జమ చేస్తే బయోమెట్రిక్ ద్వారా ఇబ్బందులు ఎదుర్కొనే పింఛన్ దారులకు కూడా ఎంతో వెసులుబాటు ఉండే అవకాశం ఉంది.

చర్యలు తీసుకుంటాం

పెన్షన్ల పంపిణీ సమయంలో లబ్ధిదారులకు చిల్లర ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటాం. ప్రతి లబ్ధిదారుడికి ఖచ్చితంగా పైన చిల్లర ఇవ్వాలి. ఈ విషయాన్ని గతంలో పోస్టల్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. మొత్తం పింఛన్ ఇవ్వకపోతే సదరు బీపీఎంపై చర్యలు తీసుకోవాలని పోస్టల్ అధికారులకు సిఫార్సు చేస్తాం.

- సురేందర్, డీఆర్‌డీవో, కామారెడ్డి

స్థానిక సంస్థల రిజర్వేషన్ల వివరాలు తెలియజేయాలి

అక్షరటుడే, ఇందూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించి రిజర్వేషన్ల వివరాలను తెలియజేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు ఎంతశాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని అన్నారు. అలాగే 2004లో రాష్ట్రవ్యాప్తంగా డెడికేటెడ్ కమిషన్ ద్వారా బీసీ కులగణన చేశారని, నివేదిక ఆధారంగా బీసీలకు ఎన్నికల్లో ఎంత శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారో చెప్పాలని కోరారు. రిజర్వేషన్ల కేటాయింపునకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, యాదల నరేశ్, నారాయణ తదితరులున్నారు.

ఏక్ దిన్.. ఏక్ గంట శ్రమదాన్

అక్షరటుడే, ఇందూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ సూచించారు. నగరంలోని మినీ ట్యాంక్ బండ్‌లో ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాథ్ శ్రమదాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ సమయం కేటాయించాలన్నారు. తడి పొడి చెత్తను వేరు చేస్తూ మున్సిపల్ వాహనాల్లోనే వేయాలని కోరారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలనే ఆదేశించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, యువత, సంఘాలు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవిబాబు, సానిటరీ సూపర్ వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, ఎంఐఎస్ ఆపరేటర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో బాధితులకు ఎంతో ఉపశమనం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తాయని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గురువారం అర్బన్‌లోని 59 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాదాపు రూ.28 లక్షలు లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గంలోనీ పలు కాలనీల్లోని బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు నిరంతరంగా అందిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగానే అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నరాల రత్నాకర్ నాయకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల రిజర్వేషన్లకు డ్రా

అక్షరటుడే, కామారెడ్డి: తెలంగాణ నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలో 49 మద్యం దుకాణాల రిజర్వేషన్లకు లక్కీడ్రా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, గౌడ కులస్తుల రిజర్వేషన్ ఎంపిక కోసం గురువారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా తీశారు. జిల్లాలో మొత్తం 49 మద్యం దుకాణాలు ఉండగా వాటిలో 5 ఎస్సీ సామాజిక వర్గానికి, 2 ఎస్టీ సామజిక వర్గానికి, 7 బీసీ గౌడ కులస్థులకు లాటరీ ద్వారా మద్యం షాప్‌లను ఎంపిక చేశారు. వీటి ఆమోదానికి రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు పంపిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదన పు కలెక్టర్ విక్టర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వెంకటేష్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జయరాజ్, జిల్లా ఎస్టీ అభివృద్ధి అధికారి సతీష్ పాల్గొన్నారు.

మక్క కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

అక్షరటుడే, బాల్కొండ: ప్రభుత్వం వెంటనే మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వేల్పూర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా, అలాగే నిజామాబాద్ జిల్లాలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట చేతికొచ్చిందని.. దాదాపు 60 శాతం పంట కోతలు పూర్తయ్యాయన్నారు. ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తక్కువ ధరకు వ్యాపారులకు అమ్మి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు కోసిన పంటను నిల్వ చేసే పరిస్థితి లేదన్నారు. దీంతో ఇదే అదనుగా ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులను మోసం చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో అన్ని పంటలను మెరుగైన మద్దతు ధర ఇస్తామని చెప్పిన హామీ అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.2,800లకు మక్కలు కొనుగోలు చేయాలన్నారు. అలాగే సోయా కూడా చేతికొస్తున్న తరుణంలో ప్రభుత్వం ఇప్పటినుంచే కార్యాచరణ ప్రారంభించాలని కోరారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తిచేయాలి

అక్షరటుడే, ఆర్మూర్: అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరగా పూర్తిచేయాలని ఆర్మూర్ ఎంపీడీవో శివాజీ సూచించారు. పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ఈ పనులకు సంబంధించి ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజాగంగారాం, ఏఈ నితీశ్, కాంప్లెక్స్ హెచ్ఎం నవీన్, చేతన్‌కుమారి, కవిత, ఇందిర, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, అనసూయ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అరబిక్ విభాగంలో సునీల్‌రెడ్డికి డాక్టరేట్

అక్షరటుడే, మెండోరా: మండలానికి చెందిన సావెల్ గ్రామ యువకుడు దోనుపాల సునీల్ శెట్టి పీహెచ్‌డీ పట్టా సాధించాడు. ఉస్మానియా యూనివర్సిటీలోని అరబిక్ విభాగంలో 'అరబిక్ కథలు - సమాజ అభివృద్ధిలో వాటి ప్రభావం' అనే అంశంపై విశ్లేషణాత్మక పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నారు. ప్రొఫెసర్ మోహాజిబిన్ అక్తర్ మార్గదర్శకత్వంలో ఈ పరిశోధన పూర్తిచేసిన సునీల్ శెట్టి, నిరుపేద కుటుంబానికి చెందినవారు. పేద కుటుంబంలో పుట్టి డాక్టరేట్ సాధించడంతో సునీల్ శెట్టిని బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు అభినందించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం

అక్షరటుడే, బాన్సువాడ : మండలంలోని హన్మాజిపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఆర్తో వైద్య నిపుణులు సాయి అశోక్ కీళ్లు, నడుము, వెన్ను, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న 71 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవి, సూపర్ వైజర్ పాప, స్వప్న, ఆరోగ్య కార్యకర్తలు అనురాధ, సావిత్రి, మీనా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

అక్షరటుడే, బాన్సువాడ: చిన్న కొడప్‌గల్ సొసైటీ పరిధిలోని కాటేపల్లి గ్రామానికి చెందిన సంఘ సభ్యుడు పిట్లం గంగబోయి ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా జేఏపీ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం పరిహారం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ నాగిరెడ్డి, వైస్ ఛైర్మన్ గంగాగౌడ్ రూ. 2 లక్షల చెక్కును గంగబోయి భార్య పిట్లం సాయమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు పెంటయ్య, సాయ గౌడ్, సంఘ సెక్రెటరీ హన్మాండ్లు, గ్రామ నాయకులు మల్లప్ప పటేల్, బోద్నం విఠల్, గంగారెడ్డి, ఇస్మాయిల్, హాజీ నారాగౌడ్, మొగులయ్య, చోటకూరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని లలితామహాల్ టాకీస్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. కొద్దిరోజులుగా భిక్షాటన చేస్తున్న ఈ వ్యక్తి గురువారం ఉదయం టాకీస్ సమీపంలో పడి ఉండగా స్థానికులు గుర్తించి మూడో టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి వయస్సు సుమారు 55 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వరకు ఉంటుందని.. ఇతర సమాచారం కోసం మూడో టౌన్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు..

8 మందికి తీవ్రగాయాలు

అక్షరటుడే, డిచ్‌పల్లి : డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. దీంతో బస్సులో ఉన్న ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. నిర్మల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బస్సు సుద్దపల్లి సమీపంలో ప్రమాదానికి గురైంది. డ్రైవర్ అజాగ్రత్త నడపడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఆ సమయంలో బస్సులో మొత్తం 27 మంది ప్రయాణికులు ఉండగా.. ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న డిచ్‌పల్లి ఎస్సై షరీఫ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నగరంలోని కోటగల్లి నగర పద్మశాలి సంఘంలో భక్తుల పూజలు

కోటగల్లి కోటగడ్డ మైసమ్మ ఆలయంలో..

దుర్గమ్మకు భక్తితో ప్రణమిల్లి..

దేవీ శరన్నవాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆయా మండపాల్లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండపాలను అందంగా తీర్చిదిద్దారు. నవరాత్రుల్లో భాగంగా నాలుగో రోజు గురువారం అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రోజు అమ్మవారికి ముదురు బంగారు రంగు వస్త్రం సమర్పించారు. అమ్మవారికి నైవేద్యంగా ఈ రోజు కదంబం ప్రసాదాన్ని నివేదిస్తారు. ఆయా మండపాల వద్ద కోలాటాలతో సందడి నెలకొంది. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

కోటగల్లి తుల్జాభవానీ యూత్..

గౌతంనగర్‌లోని ప్రసన్నాంజనేయ ఆలయంలో అమ్మవారు..

కోటగల్లీలోని భగత్‌సింగ్ రోడ్ శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

శివాజీనగర్‌లోని హృదయ రఘురాం యూత్ ఆధ్వర్యంలో..

సెలవుల్లో ఊరెళ్తున్నారా.. జాగ్రత్త: ఎస్సై శ్రీకాంత్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: దసరా సెలవుల్లో ఊరెళ్తే జాగ్రత్తలు పాటించాలని నాలుగో టౌన్ ఎస్హెచ్‌వో శ్రీకాంత్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడారు. విలువైన వస్తువులను ఇంట్లో ఉంచి తాళం వేసి వెళ్లవద్దని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఇంటికి తాళం వేసి వెళ్లాల్సి వస్తే ఇరుగుపొరుగు వారిని గమనిస్తూ ఉండాలని చెప్పాలన్నారు. కాలనీల్లో అపరిచిత వ్యక్తుల సంచారం కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. దసరా, నవరాత్రులు, బతుకమ్మ వరుస పండుగల నేపథ్యంలో భారీ నగలు ధరించేటప్పుడు జాగ్రత్తలు వహించాలని.. వాటి భద్రతపై అత్యంగా జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. చైన్ స్నాచింగ్ జరుగుతున్న దృష్ట్యా అనుమానాస్పద వ్యక్తుల గురించి తెలిస్తే వెంటనే 100కు డయల్ చేయాలని.. స్థానిక పోలీసులను అలర్ట్ చేయాలని సూచించారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

అక్షరటుడే, ఇందల్వాయి: సీఎం సహాయ నిధి పథకం పేదలకు అండగా నిలుస్తోందని సొసైటీ ఛైర్మన్ నోముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి కృషితో మంజూరైన రూ.4లక్షలకు పైగా విలువైన 19 చెక్కులను గురువారం లబ్ధిదారులకు సొసైటీలో అందజేశారు. కార్పొరేట్ వైద్య ఖర్చులు భరించలేని పేదవారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ధన్ల రాజు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు దామ సుమన్, సీనియర్ నాయకులు ఎండ్రాల గంగారం, కుంట ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చలో సెక్రెటేరియట్'కు వెళ్తున్న అంగన్‌వాడీల అరెస్ట్

అక్షరటుడే, ఇందూరు: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని చలో సెక్రెటేరియట్ కార్యక్రమానికి వెళ్తున్న కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ బాబు అన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్‌తో పాటు జిల్లాలోని పలువురు అంగన్‌వాడీలను గురువారం ఉదయం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల నిర్బంధాలు ఉద్యమాన్ని ఆపలేమన్నారు. ప్రజాపాలన అని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలు తమ సమస్యలను చెప్పుకునే అవకాశం ఇవ్వకుండా అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ఎంతగా నిరోధించాలని ప్రయత్నించినప్పటికీ వందలాది మంది హైదరాబాద్‌కు తరలి వెళ్లారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న అంగన్‌వాడీలతో మాట్లాడి.. ఠాణా వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సవిత, స్వాతి, విజయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

అక్షరటుడే, డోంగ్లి: మండలంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద, నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందన్నారు. మానవతా దృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ పరమేష్ పటేల్, మాజీ సొసైటీ ఛైర్మన్ శివాజీ పటేల్, దీన్ దయాల్ పటేల్, విలాస్, ఉమాకాంత్ పటేల్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో మహాజన సభ

అక్షరటుడే, బాన్సువాడ: బాన్సువాడ సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం సొసైటీ అధ్యక్షుడు ఎర్వాల కృష్ణారెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రైతులకు ఆర్థిక లావాదేవీల వివరాలను వివరించారు. సంఘం లాభదాయకంగా ముందుకు సాగుతోందని, వర్షాకాలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగలపై పీడీ యాక్ట్ నమోదు: ఎస్పీ రాజేష్ చంద్ర

అక్షరటుడే, కామారెడ్డి: నేరపూరిత చర్యలతో సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తున్నట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. జాతీయ రహదారులపై దారి దోపిడీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులపై కామారెడ్డి పోలీసులు పీడీ యాక్టు నమోదు చేశారు. సంబంధిత ఉత్తర్వుల కాపీని నిజామాబాద్ సెంట్రల్ జైలులో ఉన్న ముఠా సభ్యులకు గురువారం పోలీసులు అందజేశారు. కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలలో జాతీయ రహదారులపై వాహనదారులను లక్ష్యంగా చేసుకుని కొద్దికాలంగా దారి దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా ఔరాద్ గ్రామానికి చెందిన కృష్ణబాబు షిండే, మహారాష్ట్ర నాందేడ్ జిల్లా మంగ్యాల్‌కు చెందిన నాందేవ్, నాందేడ్ జిల్లా వసూర్ గ్రామానికి చెందిన రాథోడ్ అజిత్ రమేశ్ ప్రస్తుతం నిజామాబాద్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. వీరిపై గతంలో మహారాష్ట్రలోని ఉద్గిరి రూరల్, నీలంగా పోలీస్ స్టేషన్లలో హత్య, హత్యాయత్నం కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. వీరిపై కలెక్టర్ జారీచేసిన పీడీ యాక్టు ఉత్తర్వులను సదాశివనగర్ సీఐ సంతోష్, గాంధారి ఎస్సై ఆంజనేయులు నిందితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. సమాజంలో శాంతి, సామరస్యత నెలకొల్పేందుకు నిందితులపై పీడీ యాక్టు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ యాక్టు నమోదుతో నిందితులు ఒక ఏడాది వరకు జైలులోనే ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఎవరైనా నేరపూరిత చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

రేపు పేరెంట్, టీచర్ మీటింగ్

అక్షరటుడే, కమ్మర్‌పల్లి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పేరెంట్, టీచర్ మీటింగ్ ఉంటుందని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ మధుకుమార్ తెలిపారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు అధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలో చదివే ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు. తద్వారా విద్యార్థుల విద్యాప్రగతి, వారికి అందిస్తున్న వసతులు, హాజరు, తదితర విషయాలపై అధ్యాపకులతో చర్చించవచ్చని సూచించారు. అలాగే వారి సూచనలు, సలహాలు చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజ్‌కుమార్, శ్రీహరి, గంగాధర్, మురళీకృష్ణ, గంగారాం, మహేందర్, స్రవంతి పాల్గొన్నారు.

కార్యదర్శి బదిలీ నిలిపేయాలని తీర్మానం

అక్షరటుడే, బోధన్: మండలంలోని మినార్‌పల్లి సొసైటీ కార్యదర్శి హన్మాండ్లు బదిలీని నిలిపేయాలని సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం నిర్వహించిన మహాజన సభలో తీర్మానం చేశారు. ఆయన బదిలీ ఉత్తర్వులు నిలిపేసి యథాస్థానంలో కొనసాగించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా సభ్యులు, రైతులు మాట్లాడుతూ.. మినార్‌పల్లి సహకార సంఘం కార్యదర్శిగా పని చేస్తున్న హన్మాండ్లును బోధన్‌కు బదిలీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే పాలకవర్గ మండలి బదిలీ ఉత్తర్వులను రద్దు చేయాలని తీర్మానించిందన్నారు. సమావేశంలో సహకార సంఘం చైర్మన్ మెట్ల రవీంద్ర బాబు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రావు, డైరెక్టర్లు పామేశ్వర్ రావు, దేవయ్య, సుజాత, నారాయణ, సభ్యులు వసంత్ రావు, షాకిర్ పటేల్, సాయిరెడ్డి, మన్సూర్ పటేల్, తారాచంద్ పాల్గొన్నారు.

26, 27న ఐలమ్మ, కొండా లక్ష్మణ్ జయంతి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: స్వాతంత్ర సమరయోధులు కొండా లక్ష్మణ్ బాపూజీ, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించనున్నట్లు బీసీ వెల్ఫేర్ అధికారి నర్సయ్య తెలిపారు. ఈనెల 26న చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా హనుమాన్ జంక్షన్ వద్ద ఆమె విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ఖలీల్‌వాడిలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే, 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా వినాయక్ నగర్‌లోని ఆయన విగ్రహానికి నివాళులర్పించి, న్యూ అంబేద్కర్ భవన్‌లో జయంతి ఉత్సవాలు ఉంటాయన్నారు.

పండిత్ దీన్ దయాళ్ జయంతి

అక్షరటుడే, ఎల్లారెడ్డి: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మర్రి బాలకిషన్, బత్తిని దేవేందర్, మండల అధ్యక్షుడు పెద్దేండ్ల నర్సింలు, పట్టణ అధ్యక్షుడు అగల్ దివిటీ రాజేష్, ప్రధాన కార్యదర్శి పద్మ శ్రీను, మాజీ అధ్యక్షుడు ఎస్ ఎన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వంగపల్లి కాశీనాథ్, అల్లం పండరి, కోశాధికారి గజానన్ పాల్గొనారు.